# రూపాయి ఆత్మకథ

శ్రీమతి ఇంకొల్లు రంగనాయకమ్మ

నేనెవరో మీకు తెలుసా? నేను మీ అందరికి ప్రేమ పాత్రుడను. కనుక నా జీవితమును గూర్చి మీ అందరికి చెప్పుతా వినండి.

నేను మొదట అమెరికాలో మెక్సికో ప్రాంతపు ఒకగనిలో వున్నాను. నేను యీ ప్రపంచములో స్త్రీరూపములో వుద్భవించితిని. కాని భగవంతుడు నాయందు దయయుంచి నన్ను పురుషునిగా మార్పించినాడు. ఇది నాకెంతయో సంతోషకరము. భగవంతుని సృష్టిలో పురుషరూపమును స్త్రీ రూపముగను, స్త్రీరూపమును పురుషరూపముగను మారుట ఎవరైన చూడగలిగితిమా? లేదు కాని నా కటువంటి మహాద్భాగ్యము కలిగినది. ఇందువలననే నాకెంతో ఆనందము.

గనిలో నేను నాసహోదరులైన తగరము, సీసము మొదలగువాటితో కలసి మెలసి యుంటిని. అప్పుడు నేను నల్లగా వుండేదానిని. మేమప్పుడు మాతల్లి ఒడిలో వొదిగి వుండుటచేత మాకు చాల సుఖముగా వుండెడిది. తల్లివొడిలోవున్న ఎవరికి సుఖముగా నుండదు? అటువంటి సుఖమునుండి వేరు పడవలసిన దినములు వచ్చినవి.

ఒకరోజు ఆకస్మాత్తుగా కూలీల ఇనుప గునపమునకు తగిలితిని. ఇంకేమున్నది. వారు నన్ను త్రవ్వి బయటకు దీసిరి. అలా త్రవ్వి బయటకు తీసిననన్ను మండుచున్న అగ్నిలో పడవైచిరి. అబ్బా బాధ చెప్పనలవిగాదు. నన్నుచూచి నా సహోదరులు ఎంతో బాధపడిరి కాని ప్రయోజనము? జ్వాలమూర్తి అగ్ని నాశరీరమును కరుగవైచెను. కాని మరల అగ్నినుండి బయటకుతీసి చల్లని నీటిలో ముంచుటవలన ఆచల్లదనమునకు నేను ఒక ముద్దరూపములో తయారై "రజితము" అని పేరుపొందితిని.

ఇప్పుడు నన్ను భారత దేశమునకు పంపిరి. భారతదేశపు సర్కారువారు నన్నుకొని నాణ్య రూపములో నన్ను తయారు చేయుటకుగాను మూసలలో పోయించిరి. మరల యింకొకసారి అగ్నియొక్క మంటలకు గురికావలసి వచ్చినది. ఆవిధముగ నన్ను మూసలలో పోసి, రూపాయి, అర్ధరూపాయి మొదలగు నాణ్యములుగా తయారుచేసిరి. ఇప్పుడే నా స్త్రీత్వముపోయి పురుషత్వము ప్రాప్తించినది. ఈనాణ్య రూపముగా యీభారతదేశమందే కాక, యితర దేశములందు గూడ నా పేరు ఖ్యాతిగాంచినది.

రూపాయిపేరుతో ఒకసారి మద్రాసు వెళ్లితే, మరొకసారి విజయవాడ, మరొకసారి డిల్లీ, వేరొక సారి కలకత్తా. ఇదియంతయు ఎందుకు. నేను భారత దేశములో తిరుగని ప్రదేశమేలేదు. దేశాటనము చేయుటవలన నాకు ఎంతో ఆనందము కలిగినది. ఈప్రకృతి ఎంత రమణీయము!

సాధారణముగా నాయొక్క నివాసస్థానము బ్యాంకులు, శ్రీమంతుల ధనగారములలోను, మనీపర్సుల లోను, గ్రామీణుల జేబులలోను గృహిణుల పోపుపెట్టెలలోను. ఒకచోటేమి, అంతటనూ నేనే. ఒకసారి నేను ఒక పెద్ద ఆపత్తు పాలైపోతిని. బహుశ అవి నా చెడురోజులేమో. ఖర్మము చాలక, ఒక (పిసినారి) అంటె పిసినిగొట్టు చేతులలోపడితిని. ఆ మహాశయుడు నన్ను భూమిలో పాతిపెట్టెను. ఇంకేమున్నది?

అక్కడ నా అవస్థ చెప్పలేను. ఎటువైపుచూచినను అంధకారమే. గాలి అసలేలేదు. భూమిలోని తడివలన నా ముఖము నల్లబడి పోయినది. ముఖమేమి ఖర్మము? నా శరీరమంతాకూడాను. ప్రకృతినంతయు తిలకించుచు ఆనందముతో నుండు నేను అంతటి దురవస్థపాలైపోతిని. అప్పుడు నిజంగా నేను ఏడ్వని దినమేలేదు. ఎప్పుడు నేను మరల బయిటకువచ్చి సుఖముగా వుందునా యని, కాని ఆ విధముగా 20, 30 సంవత్సరములు వుండిపోతిని. అబ్బా! ఇప్పటికి నా అదృష్టము పండినది. లేకపోతే నేను ఏడ్వగా ఏడ్వగా ఆభగవంతుడు నాయందు కనికరించి రక్షించవలెనని తలచెనేమో, ఎవరెరుగుదురు! అకస్మాత్తుగా ఒకరోజున ఒక దొంగ నేనువున్న స్థలమంతయు త్రవ్వి నన్ను బయటకు తీసెను. ఇంతటితో నాకష్టము లీడేరెనని అనుకొంటిని. ఇంతలో వాడు నన్నొక హోటలువానికిచ్చి కాఫీ వగైరా త్రాగెను. హోటలు యజమాని నన్ను చిల్లర సోదరులతోపాటు నన్ను గూడ ఒకపెట్టెలో పడవైచెను. కాని అచ్చటనుండి కొద్దిరోజులలోనే బయటకు రాగలిగితిని. అప్పటినుండి నాకు ఎటువంటి ఆపత్తియూలేదు. నేను తిరుగని ప్రదేశమేలేదు. నేను చేసిన యాత్రలవలన నాకుకలిగిన అనుభవము ఎంతైనసుకలదు. నేను వెళ్లని చోటేలేదు. నేను చూడని మనిషేలేదు. ఎవరు నన్నుచూచి ఆనందింపరు? ఎవ్వరికి నన్నుచూచి ఆశకలుగదు? ఇప్పుడు నేను ఒక బీదముసలి అవ్వవద్ద నున్నాను. ఆమె ఏకైక పుత్రుడను నేనే. ఆమె పంచప్రాణముల సైతము నేనే. ఆమెయొక్క సర్వస్వము నేనే. ఆమె నన్నెంతో ప్రేమతో చూచుకొనుచున్నది.

నేను ఎంతటి మహిమ కలవాడిని! ప్రపంచమున కంతటికి సుఖము, ఆనందము కలుగజేయువాడను నేను. చనిపోయేవాడిని బ్రతికించగలశక్తి నాలోనున్నది. ఆకలిగలవానికి అన్నము, బట్టలు లేనివానికి బట్ట ఏది ఎవరికి కావలయునో అది యంతయు యీడేర్చగలశక్తి నాలోనున్నది. రాజును గరీబుగాను, పేదను నవాబుగను చేయగలశక్తి నాలోకలదు. మానవునికి ప్రతిష్ట కలిగింపచేయకల వాడినికూడ నేనే. నిజంగా చెప్పదలచుకుంటే యీప్రపంచమంతాకూడా నామీద ఆధారపడవలసినదే. ఇందుచేతనే "ధనమూలం మిదం జగత్" అని అన్నారు పెద్దలు. నన్ను పొందుట కొరకుగాను యీ మానవులు ఏమి చేయకుండానున్నారు? ప్రతివారికిని నాయందు ఆశయే. చదువుకొనుట నాకొరకేగదా? కష్టపడి పరిశ్రమచేయుట నాకొరకేగదా! దొంగతనము కాని, అబద్ధమాడుటగాని నన్నుపొందుటకేగాదా! ఒక్కొక్కరు నాకొరకు తమప్రాణముల్సైతము పోగొట్టుకొనుటకు సంసిద్ధులౌతారు. నేను మానవుని సర్వస్వమును. ఆహాహా! యీ ప్రపంచములో నాతోసమానులు ఎవ్వరునూలేరుగదా. అందరు నన్ను ఎంతో ప్రేమతో పూజించుచుందురుగదా! నేను ధన్యజీవిని!

— o —


# బిల్వ, వేప

బిల్వ, వేప అను జాతీయమూలికలనుగూర్చి శాస్త్రవిషయక పరిశ్రమచేసి వ్రాయబడిన ఉత్తమ గ్రంథరాజములు. ఈ మూలికల ఓషధిగుణము, వైద్యప్రయోగములు, శాస్త్రచర్చ, పురాణ వివరము, సరళశైలిలో వివరింపబడినవి. వైద్యులకు, భక్తులకు మిక్కిలి ఉపయోగకరమైన గ్రంథములు. క్రౌనుసైజున మంచి ఫెదరువైటు కాగితములమీద ముద్రింపబడి గృహలక్ష్మి గ్రంథమాలలో ద్వితీయ తృతీయ కుసుమములుగా ప్రచురింపబడినవి.

గ్రంథకర్త: కే. యస్. కేసరి    ప్రతి 1-కి 0-12-0

గృహలక్ష్మి కార్యాలయము, రాయపేట :: మద్రాసు.